# ఏపీలో కిలో అరటి అర్ధ రూపాయి

## అగ్గిపెట్టె కూడా రాదు.. పార్లమెంట్‌లో వైసీపీ ఎంపీ..



ఏపీ న్యూస్, 04 డిసెంబర్ (క్రాంతి న్యూస్): ఏపీ రాజకీయాల్లో ఇప్పుడు అరటి హాట్ టాపిక్‌గా మారింది. అరటి ధరలు దారుణంగా పడిపోయాయని.. కిలో 50 పైసలకు అమ్మాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రతిపక్ష వైసీపీ విమర్శలు చేస్తోంది. దీనికి అధికార పక్షం కూడా ప్రతివిమర్శలు చేస్తోంది. ఈ నేపథ్యంలో ఈ విషయం ఢిల్లీకి చేరింది. ఆంధ్రప్రదేశ్ అరటి రైతులు ప్రస్తుతం చాలా దయనీయ పరిస్థితుల్లో ఉన్నారని.. వారిని కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి లోక్‌సభలో ప్రస్తావించారు. అరటి పండ్ల ధరలు పడిపోయాయని.. కిలో అరటి కేవలం 50 పైసలు మాత్రమే పలుకుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ 50 పైసలతో కనీసం ఒక బిస్కెట్ లేదా అగ్గిపెట్టె కూడా కొనలేమని పరిస్థితి తీవ్రతను వివరించారు. పంట కోయడానికి అయ్యే ఖర్చు కూడా అరటి రైతులకు ఇప్పుడు రావడం లేదన్నారు. అందుకే ఆంధ్ర అరటి రైతులకు తక్షణ సహాయం చేయాలని కోరారు.

ఈ సందర్భంగా తమ హయాంలో వ్యవసాయంపై అనుసరించిన విధానాలను మిథున్ రెడ్డి వివరించారు. గతంలో జగన్ ప్రభుత్వం రైతులకు ఉచిత పంట బీమాతో పాటు ఇన్‌పుట్ సబ్సిడీ వంటి అనేక ప్రోత్సాహకాలు అందించేదని చెప్పారు. దాని ద్వారా రైతులపై భారం తగ్గిందని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేసిన మిథున్ రెడ్డి.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారికి ఆర్థికంగా చేయూత అందించడం అత్యవసరమని అన్నారు. అరటి ధరలు పడిపోవడం, సరైన మద్దతు లేకపోవడం వల్ల రైతులు అప్పుల పాలవుతున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు.

కాగా, ఏపీలో అరటి ధరల సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని.. వెంటనే కేంద్ర బృందం రాష్ట్రానికి వచ్చి పరిశీలించాలన్నారు. ప్రభావిత జిల్లాలో పర్యటించి రైతుల సమస్యల గురించి తెలుసుకోవాలని ఎంపీ మిథున్ రెడ్డి కోరారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా పంటల ధరలు స్థిరంగా ఉండేందుకు, నిల్వ సౌకర్యాలు మెరుగుపరచడానికి, మార్కెటింగ్ మౌలిక సదుపాయాలు కల్పించడానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.


ఇదిలా ఉండగా, ఏపీలో కిలో అరటి ల 50 పైసలకే విక్రయిస్తున్నారని మాజీ సీఎం జగన్ ఇటీవల ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. ఆ వార్తను తప్పంటూ ఏపీ ఫ్యాక్ట్ చెక్ ట్విట్టర్ హ్యాండిల్‌లో సమాధానం ఇచ్చారు. "అక్టోబర్‌లో ఈ సీజన్ ప్రారంభం కాగానే టన్ను రూ.12 వేల నుంచి రూ.14 వేల వరకూ అమ్ముడు పోయింది. నవంబరు మొదటి వారంలో ఏ గ్రేడు అరటి పండ్లు రూ.7 వేలు, బీ గ్రేడ్ రూ.4 వేలు, సీ గ్రేడ్ రూ.3వేలకు అమ్ముడు పోయాయి. రెండో వారంలో అవే ధరలు నిలకడగా కొనసాగాయి. మూడో వారంలో ఏ గ్రేడు రూ.8 వేలు, బీ గ్రేడు రూ.4 వేలు, సీ గ్రేడు రూ.3 వేలకు అమ్ముడు పోయాయి. నాలుగో వారంలో ఏ గ్రేడు రూ.8 వేల నుంచి రూ.10 వేలకు పెరిగింది. బీ గ్రేడు రూ.6 వేల నుంచి రూ 8 వేలకు, సీ గ్రేడు రూ. 4 వేల నుంచి రూ.6 వేల వరకు అమ్ముడు పోయాయి" అని ఆ పోస్టులో ఏపీ ప్రభుత్వం పేర్కొంది.

# పింఛన్ డబ్బులో నుంచి ఇంటి పన్ను వసూళ్లు

ఏపీ న్యూస్, 04 డిసెంబర్ (క్రాంతి న్యూస్): కాకినాడ జిల్లా తుని ప్రాంతంలో పింఛను డబ్బుల నుంచి ఇంటి పన్ను వసూలు చేశారంటూ వీడియో వైరల్ అయ్యింది. తుని మండలం లోవకొత్తూరుఎస్సీ కాలనీలో ఈ ఘటన జరిగింది. సర్వేయర్ సతీష్ లబ్ధిదారులకు పింఛను ఇచ్చి.. వారిలో కొందరి నుంచి ఇంటి పన్ను వసూలు చేశారని ప్రచారం జరిగింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. సర్వేయర్ సతీష్ తన పరిధిలోని 67 మందికి పింఛను పంచాల్సి ఉంది. పింఛను ఇచ్చే సమయంలోనే లబ్ధిదారులను ఇంటి పన్ను అడిగారు. 21 మంది రూ.37 నుంచి రూ.478 వరకు ఇంటి పన్ను చెల్లించారు. ఆ తర్వాత సర్వేయర్ వారికి రసీదులు ఇచ్చారు. పింఛను డబ్బుల్లోంచి ఇంటి పన్ను ఎందుకు కట్ చేస్తున్నారని కొందరు స్థానికులు ప్రశ్నించినట్లు వీడియో వైరల్ అయ్యింది.

అయితే ఈ అంశంపై తుని ఎంపీడీవో క్లారిటీ ఇచ్చారు. పింఛన్ డబ్బుల నుంచి ఇంటి పన్ను మినహాయించాలని తాము ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదన్నారు. కొంతమంది పింఛన్ లబ్ధిదారులు వారికి ఇచ్చిన డబ్బుల్లో నుంచి ఇంటి పన్ను చెల్లిస్తామన్నారని.. అందుకే వారి దగ్గర ఈ విషయాన్ని సచివాలయ సిబ్బంది ప్రస్తావించారన్నారు. తాము ఎవరి దగ్గర పింఛన్ డబ్బుల్లో నుంచి ఇంటిపన్ను వసూలు చేయలేదన్నారు. ఈ అంశంపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తామన్నారు.





Panchayat Raj and Rural Development
L.Kothuru Gram Panchayat
Tuni Mandal, Kakinada District
2025-26 Financial Year
House Tax Receipt

Panchayati Raj

Assessment Owner Details

Assessment No: 296662000629
Old Assessment No: 388
Owner Name: Yandaguda Nukalamma
Door No: 3-117
Village: Kothuru
Mobile Number: 7893565882

Receipt Details

Transaction Number: TAX01122025030055365
Mode of Payment: UPI(QR Code)
Transaction Date: 01-Dec-2025 03:00:55 PM
Payment Status: Success

| Sl NO | Demand Year | Demand Category | Paid Amount (In Rs.) |
|---|---|---|---|
| 1 | 2025-26 | Current | 243 |
| | Grand Total | | 243 |

అయితే ఈ అంశంపై తాజాగా ఏపీ ఫ్యాక్ట్ చెక్ టీమ్ క్లారిటీ ఇచ్చిది. మాకు పింఛను డబ్బులు అందిన తర్వాత ఇష్టపూర్వకంగానే ఇంటి పన్ను కట్టాము..కొందరు దీనిని తప్పుగా ప్రచారం చేస్తున్నారు' అంటూ స్థానిక మహిళలు మాట్లాడిన వీడియోను ట్వీట్ చేశారు.

'అనకాపల్లిజిల్లా తుని ప్రాంతంలో పెన్షన్ డబ్బుల నుంచి ఇంటి పన్ను కట్ చేశారు అనే తప్పుడు వార్త ను కొందరు తమ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారు. ఇంటి పన్ను కట్టమని, సచివాలయం సిబ్బంది తమను డిమాండ్ చెయ్యలేదని, తామే ఇష్టపూర్వకంగా కట్టాం అని లోవకొత్తూరు మహిళలు చెబుతున్నారు. కావున వాస్తవాలు తెలుసుకుని తప్పుడు ప్రచారం ఆపాల్సిందిగా కోరడమైనది' అంటూ ఏపీ ఫ్యాక్ట్ చెక్ టీమ్ ట్వీట్ చేసింది.

## సౌతాఫ్రికాలో కుమారుడు మిస్సింగ్... తల్లి కన్నీరు మున్నీరు



ఏపీ న్యూస్, 04 డిసెంబర్ (క్రాంతి న్యూస్): సౌతాఫ్రికాలో కొడుకు మిస్సింగ్‌పై ఏపీలో ఉన్న తల్లి కన్నీరు మున్నీరు అవుతున్నారు. తన కొడుకు ఆచూకీ తెలపాలని కోరుతున్నారు. తన కుమారుడిని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ క్షేమంగా ఇంటికి చేర్చాలని ఆమె కోరారు. శ్రీసత్యసాయి జిల్లా తలుపుల మండలం కొవ్వూరు వాండ్లపల్లికి చెందిన రామచంద్ర ఏడాది క్రితం సౌతాఫ్రికా వెళ్లారు. బోర్ వెల్స్‌లో పని చేస్తూ అప్పుడప్పుడు ఫోన్‌లో కుటుంబ సభ్యులతో మాట్లాడేవారు. అయితే నవంబర్ 22న నుంచి రామచంద్ర నుంచి ఎలాంటి ఫోన్ గాని, సమచారం లేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. రామచంద్రను సౌతాఫ్రికాలో కొందరు దుండగులు కిడ్నాప్ చేశారని, అతను పని చేసే సంస్థ యజమాని చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ తర్వాత నుంచి ఎలాంటి వివరాలు తమకు తెలియలేదని రామచంద్ర తల్లి వాపోయారు. తమ బిడ్డను క్షేమంగా ఇంటికి చేర్చాలని ప్రభుత్వాన్ని ఆమె కోరుకున్నారు.

## రైతులను ప్రభుత్వం దగా చేస్తోంది: మాజీ ఎంపీ చింతా అనురాధ



ఏపీ న్యూస్, 04 డిసెంబర్ (క్రాంతి న్యూస్): కూటమి ప్రభుత్వ పాలనలో రైతులకు అన్యాయం జరుగుతోందని, ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఇబ్బందులను పట్టించుకోవడం లేదని అమలాపురం మాజీ ఎంపీ చింతా అనురాధ విమర్శించారు. గురువారం ఉప్పలగుప్తం మండలంలోని సన్నవిల్లి గ్రామంలో రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించి, ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు పడుతున్న కష్టాల గురించి ఆమె అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా చింతా అనురాధ మాట్లాడుతూ రైతు పక్షపాతి వైయస్ జగన్ మోహన్ రెడ్డి తన పాలనలో రైతాంగానికి విత్తనం నుండి కొనుగోలు వరకూ సంపూర్ణ సహకారం అందించి వారికి అండగా నిలిచారని, అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా చివరి గింజ వరకూ కొన్నారని, కానీ కూటమి ప్రభుత్వం రైతులను పూర్తిగా దగా చేస్తోందన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటంతా రోడ్డు మీదకు తీసుకువచ్చి బాధపడుతున్నా వారిని పట్టించుకోవడంలేదని ఆమె విమర్శించారు. కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను నట్టేట ముంచుతొందని, పంట నమోదు, తేమ శాతం అంటూ ఆంక్షలు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు.

## వేడెక్కిన కడప కార్పొరేషన్.. కొత్త మేయర్ ఎంపికకు 7న నోటిఫికేషన్



ఏపీ న్యూస్, 04 డిసెంబర్ (క్రాంతి న్యూస్): కడప కార్పొరేషన్ కొత్త మేయర్ ఎంపికకు ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 7న ఎన్నికల నోటిఫికేషన్ రానుంది. 11వ తేదీ ఎన్నిక నిర్వహించనుంది. దీంతో కడప కార్పొరేషన్ లో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. వైసిపికి స్పష్టమైన బలం ఉన్నప్పటికీ కార్పొరేటర్‌లు వర్గాలుగా ఉండడంతో పార్టీ అధిష్టానం వారందరిని తాటిపైకి చేర్చి అభ్యర్థిని ఎంపిక చేయడం కొంత తలనొప్పిగానే మారింది. దీంతో వైసీపీ అధిష్ఠానం మేయర్ ఎన్నిక అభ్యర్థి ఎంపికపై కసరత్తు పెట్టనుంది. నిబంధనలకు విరుద్ధంగా గత మేయర్ సురేష్ బాబు కుటుంబ సభ్యులు కార్పొరేషన్‌లో పనులు చేపట్టడంపై ప్రభుత్వం ఆయనను మేయర్‌గా తొలగించింది. దీంతో డిప్యూటి మేయర్ ముంతాజ్ బేగంను ఇన్చార్చ్ మేయర్‌గా నియమిండం జరిగింది. కొత్త మేయర్ ఎంపిక కోసం గురువారం ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఈ నెల 7న జిల్లా కలెక్టర్ నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. ఈ నెల 11న కార్పొరేటర్‌లు కొత్త మేయర్ ను ఎన్నుకోనున్నారు.

వైసీపీలో వేడి

కడప నగరం వైసిపిలో మేయర్ ఎంపిక వేడి రేపుతోంది. ఇప్పటికే ఈపార్టీ కార్పోరేటర్ లు వర్గాలుగా విడిపోయారు. 2021 లో మున్సిపల్ ఎన్నికల్లో 50 డివిజన్లకు గాను 48 వైసీపీ, ఇండిపెండెంట్-1 , టిడిపి-1 గెలిసింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటు తర్వాత వైసీపీని వీడి 7 మంది మంది కార్పొరేటర్లు టిడిపిలో చేరారు. ఇద్దరు కార్పొరేటర్లు మృతి చెందారు. ప్రస్తుతం 40 మంది కార్పొరేటర్లతో పూర్తిస్థాయి కోరంతో వైసీపీ ఉన్నా మేయర్ పదవి కోసం కార్పొరేటర్లు మూడు వర్గాలుగా విడిపోవడంతో ఆ పార్టీ వీరిని ఒకే తాటి పైకి తీసుకు రావాల్సి ఉంది. 2026 మార్చి 26తో పాలకవర్గం గడువు ముగియనున్న తరుణంలో కేవలం మూడునెలల కాలానికి జరుగనున్న ఈ ఎన్నిక ఆసక్తిగా మారింది.

## తిరుమలలో నకిలీ సిఫార్సు లేఖలు.. ఇద్దరి అరెస్ట్



ఏపీ న్యూస్, 04 డిసెంబర్ (క్రాంతి న్యూస్): తిరుమలలో విఐపి బ్రేక్ దర్శనం కల్పిస్తామంటూ నకిలీ సిఫార్సు లేఖలతో భక్తులను మోసగిస్తున్న ఇద్దరు వ్యక్తులను తిరుమల టూ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ప్రజా ప్రతినిధుల పేర్లతో నకిలీ లెటర్ ప్యాడ్లు సృష్టించి మోసాలకు పాల్పడుతున్న నాయుడుపేటకు చెందిన బల్లి ప్రవీణ్ కుమార్, దేవత చెంచు బాలాజీలను అదుపులోకి తీసుకున్నారు.

నిందితులు గత కొంతకాలంగా సూళ్ళూరుపేట ఎమ్మెల్యే ఎన్. విజయశ్రీ, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తిల పేర్లను దుర్వినియోగం చేస్తూ నకిలీ లెటర్లు తయారు చేస్తున్నట్లు విచారణలో తేలింది. ఒక్కో భక్తుడి నుంచి రూ.10,000 నుంచి రూ.20,000 వరకు వసూలు చేస్తూ, తాజాగా హైదరాబాదుకు చెందిన భక్తులను మోసగించే ప్రయత్నం చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి ల్యాప్‌టాప్, ప్రింటర్, మొబైల్ ఫోన్లు, బ్యాంక్ పాస్ బుక్స్, నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్‌లో టీటీడీ విజిలెన్స్ విభాగం పోలీసులకు కీలక సహకారం అందించింది.

ఈ ఘటనపై స్పందించిన తిరుమల పోలీసులు భక్తులకు కీలక హెచ్చరికలు జారీ చేశారు. శ్రీవారి దర్శనం కోసం మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని సూచించారు. దర్శనం మరియు సేవా టిక్కెట్లు కేవలం టీటీడీ అధికారిక వెబ్‌సైట్ లేదా కౌంటర్లలో మాత్రమే పొందాలని స్పష్టం చేశారు. ఎవరైనా దర్శనం పేరుతో డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

